# కన్ని

కురూపియైన ముష్టిబాలికను కొంచెం కరుణతో చూచి, ఎవరైనా, గుప్పెడు గింజలుగాని, ఒక రాగిపైసాగాని, మొహం అవతలతిప్పైనా, విసిరేస్తారు.

కొంచెం కనుముక్కుతీరు సరిగావున్న అమ్మాయి, యవ్వనంలో వుండి "బాబూ! ఇవ్వాళ పొద్దుపొడిచిన దగ్గిరనుంచి ఒక్క పిడచైనా లేక మలమల మాడిపోతూన్నాను. ఏమైనా ఇవ్వండి రాజా!" అంటే, "ఛీ! నోరుముయ్. పోతరించున్నావ్, ఇంత పనీ పాటాచేసి నాలుగురాళ్ళు సంపాదించుకోకూడదూ?" అంటాడా మహారాజు.

అంతపనీ అయింది కన్నికి. రాయలసీమలో తిండి సరీగా వుందనా? పరువుగల కుటుంబాలే, దూరాన్ని గంజి చూచుకొని బ్రతుకుతున్నారు. అన్నమో రామచంద్రా! అంటే అన్నమో రామచంద్రా! అని వానల రూపం మరిచిపోయిన పొలాలు కాని ఆ యెడార్లు ప్రతిధ్వనిస్తాయి. చెఱువులవైపుచూసి పొలాలు, పొలాలవైపు చూసి చెరువులూ కంటతడి బెట్టడానికైనా నీళ్ళులేక, వేడినిట్టూర్పులు విడుస్తాయి. మొక్కుబళ్ళకైనా ఒక్కపువ్వు పూయని యెండినచెట్లు, కొట్టి కడుపులో మంటచేసుకొనేందుకే పనికివస్తాయేమో!

## 2

కుటుంబాన్ని పోషించేభారం కన్నమ్మమీదే పడింది. గుత్తి స్టేషను వెనకపక్క ప్లాటుఫారంమీద నుంచుని, రైలు పొడుగునా తిరుగుతూ ముష్టెత్తుకునే కన్నికి పైసలు, అణాలు రెండణాకాసులు, ఒక్కొక్కప్పుడు పావలా – కాసులు కురిపించేది రైళ్ళపెట్టెలన్నీ నిండివుండే సిపాయి వీరులు. డబ్బులు వేస్తూ వినరానికూతలు కూసేవారు. పళ్ళుపుచ్చుకుని ఆమె రొమ్ముమీద పొత్తి కడుపుమీద విసిరికొడుతూ హేళనచేసేవారు. కన్నితోపాటు ముష్టెత్తుకుంటూ తిరిగే పెంచెలమ్మి కన్నికన్న ఎక్కువదుడ్డు సంపాదించేది. కాంక్షలతో చూడని మర్యాదను నిలువునా సంపాదించేది. సిఫాయీల అసభ్యపు అసహ్యపు మర్యాదను భరించలేక కన్ని రైలుదగ్గిర ముష్టెత్తడం మానింది.

## 3

ఇన్నాళ్ళూ ఖర్చుపోను ముష్టివల్ల కూడబెట్టి సంపాదించిన యిరవై రూపాయలూ రెణ్ణెల్లలో అయిపోయాయి. కాని కన్ని ఒక తెల్లని పెద్ద వెండి నాణాన్ని మాత్రం అతి రహస్యంగా ఓచోట దాచుకుని పైకి తీసేదికాదు. ఆ నాణెము అమెరికా డాలరు

వెండినాణెము. అది తన కిచ్చింది ఒక సిపాయి. మూడు వందల జన్మలెత్తినా కన్ని ఆ సిపాయిని మర్చిపోలేదు. ఎంత పొడుగ్గా వున్నాడు ఆ కుర్రాడు! ఒక రోజున బొంబాయి యెక్సుప్రెస్సు గుత్తి స్టేషనులో చాలాసేపాగింది. యధాప్రకారం సిపాయిలందరూ తనకు డబ్బూ వేశారు. పళ్ళూ గిరవాటువేశారు. నాను రొట్టెలుచ్చుకుకొట్టారు. ఇంతలో ఓ సింహంలా ఆ మదరాసు నాయళ్ళబ్బాయి ఊరకుక్కలు అల్లరిపెట్టే ఆవుదూడ దగ్గరకు వచ్చే గోమాతలా వచ్చాడు.

"నీపేరెవరు?"

"కన్నె అంటారు సామీ"

"ఇదిగో కన్నీ, నీకుదా ఈ ముష్టి ఎందుకు?"

"చక్కని నీ మొగంలో విషాదం కురవబోయే...ఏ...మొయిల్లావుంది. నాన్దా మద్రాసు నాయిళ్ళ కుఱ్ఱాణ్ణి. ఆఫ్రికాలో జర్మనువాణ్ణి చావకొట్టి అలసటపడి ఇంటికి నెల రోజులు సెలవుమీదదా వస్తుంటిని. ఆ యుద్ధంలో ఒక అమెరికా సైనికుణ్ణిదా, నాన్దా రక్షిస్తిని. వాడి దేశం నాణెందా ఇది. బహుమతి ఇచ్చాడు. ఇది నీ దగ్గిర గుర్తుగా వుంచుకో. ఈ దుడ్డు తీసుకొని రేపణ్ణించి ముష్టిదా మానెయ్యి" అని తన చేతిలో ఇన్ని రూపాయలనోట్లు ఒక డాలరు నాణెము పెట్టి కదలబోతూన్న రైలెక్కి మాయమైపోయినాడు.

## 4

**ఆ** మర్నాడునుంచి కన్ని ముష్టిమానింది. తమ పశుత్వ ఆకలిని తీర్చుకోడానికి ఆ బాలికను తమ పక్కలపైకి రమ్మని పలువురు ఆశించారు. పలువురు కన్నులతో కబళించారు. ఆరు కడుపులున్న తన కుటుంబాన్ని రక్షించుకోడానికి ఆ విధంగా ధనం సంపాదించే సులభమార్గాన్ని కన్ని మైలుదూరమైనా రానిచ్చిందికాదు. రహస్యంగా దాచుకున్న ఆ డాలరు నాణెం కన్నుల కద్దుకొనేది.

*"ఏదారి వచ్చావో?*
*ఏదారి పోయావో*
*నీదారి నీదిరా!*
*నాకు దారే లేదురా"*

గొణుగుకొనేది. అప్పటికి మూడురోజులనుంచి ఆ కుటుంబానికి తిండి లేదు. తల్లీ తండ్రీ అందరూ "మాయముండకు మానాభిమానా లొచ్చాయంట" అని తిట్టారు. తిండిలేక నీరసపడిపోయిన కన్ని కదలదు. రైళ్ళు వస్తున్నాయి, పోతున్నాయి. ఊళ్ళోవున్న బస్సుడ్రైవర్లు, మంగలిషాపువాళ్ళు, హోటలు పనివాళ్ళు ఈ చిక్కిపోయిన బక్కముండ ఎవరిక్కావాలి? అని చక్కాపోయారు. వారి క్కావలసినా, కన్ని సిద్ధంగా వుందా? దెబ్బతిని చచ్చిపోయే పెద్దపులిలా వాళ్ళని చీల్చి చెండాడి, చచ్చిపోయి వుండును కన్ని. ఆ రాత్రల్లా వారున్న గుడిసె ప్రక్క అతి ఆకలిమత్తులో చావుబ్రతుకుల సంధ్యలో సర్వప్రపంచమూ మరిచి పడివుంది కన్నె. తెల్లవారుతూంది. "కన్నె ఎక్కడా?" అని ఒక గంభీర కంఠం

వినబడింది. అంతటి శల్యావశిష్టావస్థలోనుంచి, కోటి ఆనందాలతో ఆ కంఠం ఆనమాలు పట్టిన కన్నె, "ఇక్కడే వున్నాను నాయుడుబావా" అని కాకలీస్వనంతో జవాబిచ్చింది. ఒక్క ఛంగున రామస్వామి నాయుడు ఆ బాలిక దగ్గిరకు ఉరికాడు. ఎముకల పోగైన కన్నెను తన హృదయాని కదుముకొన్నాడు. ఆ కౌగిలింత సంజీవి. అతని హృదయము సంజీవి పర్వతము.

## 5

**రా**మస్వామినాయుడు వాళ్ళింట్లో పదిరోజులున్నాడు. ఊళ్ళో చిన్న యిల్లు అద్దెకు తీసుకొని అక్కడ ప్రవేశపెట్టించాడు. నీళ్ళు పోయగా పసిమి పొంది మిలమిలలాడిన జాజి చెట్టులా కన్ని వెనకటి అందం అంతా తెచ్చుకుంది.

"చిన్నతనాన్నుంచీ బస్సుల దగ్గిరదా ముష్టి ఎత్తేవాణ్ణి కన్నీ! అటునుంచి నేనూ ఇక్కడ నువ్వూ నదుల్లా కలిస్తిమి. రైలునుంచి చూచిన నాకు నువ్వు ఏనాడో తప్పిపోయిన నేస్తురాలివిదా కనిపిస్తివి."

రామస్వామి కన్నెకు అందాల మెడచుట్టూ మూడు ముళ్ళూ వేసినాడు. మఱి పదిరోజులికి రామస్వామి యుద్ధానికి వెళ్ళిపోయినాడు. దేవుడైనా తన రామస్వామిని తలుచుకుంటూ నెల నెలకూ అతడు పంపించే ఐశ్వర్యంతో కుటుంబాన్ని రక్షించుకుంటూ అతడు తప్ప ఇతరమేలేని అతని కొఱకై పది దినాలకిందటివరకూ కన్ని కనిపెట్టుకొనే వుంది.

"ఇటలీ యుద్ధము నెగ్గాము. నాకుడిచేయి ఇటలీకి అర్పించాను. కాని ఆరోగ్యము మహా సముద్రంలావుంది. నిన్ను గట్టిగా కౌగిలించుకొనేందుకు ఒక చేయిలేదు కన్నీ!" అని రామస్వామి టెలిగ్రాము. నా ప్రాణమే అయిన నా సామికి నేను ఒకచేయికాలేనా! అని కన్ని అనుకుంది.